<u>సమీక్ష</u>

# జిహాద్ కాదు : గాయపడిన ముస్లిం స్వరం మాత్రమే

(జిహాద్ - ముస్లిం మైనారిటీ కవుల కవితలు. ప్రచురణ : విప్లవ రచయితల సంఘం, ప్రకాశం జిల్లా. జనవరి 1997)

**ముస్లిం** కవులు రాసిన 52 కవితలతో విరసం ఈ సంకలనాన్ని ప్రచురించింది. మార్క్సిజంలో మావోయిజం స్రవంతికి కట్టుబడి ఉండే వామపక్ష రచయితల సంస్థ ఇది. అయితే ఈ సంకలనంలో కవితలు రాసిన కవులు విరసం సభ్యులు కారు.

ఈ గ్రంథం శీర్షిక ఖాజా రాసిన కవితది. ఇందులో అందరి కంటే ఎక్కువ కవితలు ఇతనివే. అయితే ఈ సంపుటానికి ఆ శీర్షికను ఎంచుకోవడం దురదృష్టకరం. ఎందుకంటే ఈ శీర్షికకు సంబంధించిన కవితలోగానీ, ఆ మాటకొస్తే ఈ మొత్తం సంకలనంలోని కవితల ధోరణిలో గానీ తీవ్రవాద ఇస్లామిక్ ధోరణులతో మంచికో చెడుకో మనం జోడించే జిహాద్ అన్న భావన లేనేలేదు. ఇందులో కవి కంఠస్వరం గాయపడ్డ వ్యక్తుల నిరసనకు సంబంధించింది; అంటే ఈ స్వరం సాధారణ వామపక్ష, దళిత భావజాలానికి సంబంధించిందే తప్ప, సమకాలీన ముస్లిం రాజకీయాల భావజాలం నుంచి వచ్చింది కాదు. ఇంకా చెప్పాలంటే సైైబాబా రాసిన కొన్ని కవితలైతే ముస్లిం ఛాందసవాదాన్ని, మరీ ముఖ్యంగా మహిళలను ఊపిరాడనివ్వకుండా చేస్తున్న తమవారి మూఢాచారాలను ఎండగట్టేవిగా కూడా ఉన్నాయి.

ఈ సంకలనానికి ఇచ్చిన 'ముస్లిం మైనారిటీ కవులు' అనే ఉపశీర్షిక కూడ సరయినది కాదు. ఈ కవితల్లో ఉన్నది పరాయీకరణకు, వివక్షకు గురైన

---

Verses of an injured non-minority పేరుతో ఇండియన్ లిటరేచర్ పత్రికలో వచ్చిన సమీక్షకు అనువాదం, 2001

మైనారిటీలకు చెందిన ఇతివృత్తం కాదు; అన్యాయానికి గురయిన వ్యక్తుల వేదన. ముస్లింలుగా ఈ కవుల అస్తిత్వం సాధారణ పేదలు, శ్రామికులు, దళితులు, కింది కులాల శూద్రుల అస్తిత్వంతో సునాయాసంగా కలగలసి పోయి, కొన్ని కవితల్లోనయితే తామే ఈ దేశంలో అధిక సంఖ్యాకులమనీ, హిందూత్వవాదులే అల్పసంఖ్యాకులనీ అనేదాకా వెళ్ళింది. నిజానికి కూడా ఒక్క హైదరాబాద్‌లో మాత్రమే పర్షియా, పశ్చిమాసియాల నుంచి వచ్చి స్థిరపడిన కొన్ని ముస్లిం రాజకుటుంబాలు ఉండవచ్చు; రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో ఉన్న ముస్లింలు మాత్రం, దాదాపు అందరూ మతం మార్చుకున్న హిందూ శ్రమజీవులే. నిరుపేదలే. మార్క్సిస్టు వర్గ విశ్లేషణ, బహుజన రాజకీయాలు వ్యాప్తి చెందాక వీరికి మరింత విస్తృతమైన అస్తిత్వం ఏర్పడింది.

ముస్లింలంటేనే ఛాందసవాదులు అన్న అభిప్రాయం ఒకప్పుడు హిందువులకు ఉన్నందువల్ల, సామాజిక స్పృహ కలిగిన రాష్ట్ర ముస్లింలు ఒకనాడు తమని తాము ముస్లింలుగా అనుకోవడానికే ఇష్టపడేవాళ్ళు కారు. అయితే బాబ్రీ మసీదు కూల్చివేత, తదనంతరం ముంబయిలో జరిగిన హత్యాకాండ వీళ్లని తెచ్చిపెట్టుకున్న ఆ సుషుప్తావస్థ నుంచి మేల్కొల్పాయి. సామాజిక చైతన్యాన్ని వదులుకోకుండానే తమని తాము ముస్లింలుగా, బాధితులుగా చూడడం నేర్చుకున్నారు. దీనివల్ల వారి దృక్పథం 1990 దశకంలో మరింత సమగ్రంగా, ఆరోగ్యవంతంగా తయారయింది. ఈ సంకలనం ఆ రకమైన సుసంపన్నతను ప్రతిబింబిస్తుంది.

ఈ భావన బహుశ మొట్టమొదట కనిపించేది ఈ సంకలనంలోని చివరి కవిత అయిన ఖాదర్ మొహియుద్దీన్ రాసిన 'పుట్టుమచ్చ'లో. బాబ్రీ మసీదు కూల్చివేతకు ముందు రాసిందే అయినా అప్పటికే సంఘపరివార్ దౌర్జన్య పూరితమైన రథయాత్రలు, శిలాన్యాస్‌లు జరిపిన నేపథ్యంలో 'భారతీయ ముస్లిం దేశద్రోహం అనే పుట్టుమచ్చతోనే ఈ లోకంలోకి వస్తున్నాడని' ఖాదర్ అంటాడు. అంతే కాదు; జీవితాంతం తను తగినంత దేశభక్తితో లేననీ, భారత క్రికెట్ టీం గెలిస్తే తగినంతగా సంతోషించడం లేదనీ వచ్చే ఆరోపణలకు సమాధానం ఇస్తూ

ఉండాలి అని అంటాడు. ఖాదర్ మొహియుద్దీన్ ప్రారంభించిన ఈ రకం కవిత్వాన్ని ఖాజా, అఫ్సర్ వంటి వారు కొనసాగించారు.

ఈ సంపుటిలోని ఏ కవీ ముస్లింల సందిగ్ధతకు సులువైన పరిష్కారం సూచించకపోయినా విరసం మాత్రం తన ముందుమాటలో ఉదారంగా మావోయిస్టు పరిష్కారమైన పోరాటాన్ని, అందుకు విప్లవకారులతో ఐక్యతను సూచిస్తుంది. అలాగని ఈ కవితలు నిస్పృహతోగానీ, విధ్వంసక దృక్పథంతో గానీ ముగియవు. నిర్దిష్టమైన పరిష్కారాలేమీ కనబడకపోయినా, ఏదో ఒక విధమైన ఆశాభావంతో ఉండడం కంటే వాస్తవిక దృష్టిని ఈ రోజుల్లో ఆశించలేం. ఈ వాస్తవాన్ని ఇందులోని కవులు గ్రహించడం మెచ్చుకోదగ్గ విషయం.